ప్రశాంతంగా ఓటింగ్

- ఓటుహక్కు వినియోగించుకునేందుకు పోటెత్తిన మహిళలు, వృద్ధులు

క్లుప్తంగా

నగరం నిర్మానుష్యం



నిర్మానుష్యంగా ఉన్న టవర్‌క్లాక్ ఏరియా

అనంతపురం కార్పొరేషన్: ఎన్నికల పోలింగ్ రోజున నగరం నిర్మానుష్యంగా మారింది. సోమవారం ఉదయం నుంచే ఓటర్లు నగరంలోని 277 పోలింగ్ బూత్‌ల వద్ద పెద్ద ఎత్తున బారులు తీరారు. ఉదయం 7 గంటల నుంచే మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో నగరంలోని పాతూరు, టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, సుభాష్‌రోడ్డు తదితర ప్రాంతాలు బోసిపోయాయి. మెడికల్ షాపులు మినహా.. ఇతర హోటళ్లు, అంగళ్లు, కూల్‌డ్రింక్, తదితర షాపుల నిర్వాహకులు సైతం స్వచ్ఛందంగా మూసివేశారు. నిత్యం ప్రజలతో కిటకిటలాడే అనంతపురం నగరంలో కర్ఫ్యూను తలపించేలా చేసింది.

టీడీపీ నాయకుల అత్యుత్సాహం

ఆత్మకూరు: మండలంలోని పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ నాయకులు అత్యుత్సాహం చూపారు. పోలింగ్ కేంద్రాల వంద మీటర్ల దూరం వరకూ ఎవ్వరూ ఉండకూడదని ఎన్నికల నిబంధనలు ఉన్నాయి. నిబంధనలను బేఖాతరు చేస్తూ పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ నాయకులు గుంపులు గుంపులుగా ఉన్నారు. అంతేకాకుండా మరి కొంత మంది టీడీపీ నాయకులు ఏకంగా టెంట్లు వేసి భోజనాలు పెట్టారు. ఇంటి దగ్గర ఓటరు స్లిప్పులు ఇచ్చి పంపారు. మండలంలోని పి.కొత్తపల్లిలో ఓ టీడీపీకి చెందిన ఏజెంట్ ఏకంగా పసుపు చొక్కా వేసుకుని పోలింగ్ కేంద్రంలో ఏజెంట్‌గా కూర్చున్నా అధికారులు పట్టించుకోలేదు. పోలీసులు కూడా తమకు ఏమి పట్టనట్లు వ్యవహరించారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు.

కస్తూర్బా పోలింగ్ బూత్‌లో దొంగ ఓట్లకు యత్నం



దొంగ ఓటు వేసేందుకు వచ్చిన యువకుడిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని పాతూరు కస్తూర్బా నగరపాలక ఉన్నత పాఠశాలలో ఓ యువకుడు దొంగ ఓటు వేసేందుకు యత్నించాడు. స్థానికంగా ఉండే వైఎస్సార్‌సీపీ కార్యకర్త మహబూబ్‌బాషా తదితరులు గుర్తించి అడ్డుకున్నారు. ఈ క్రమంలో టీడీపీకి చెందిన సానుభూతిపరులు ఆ యువకుడిని తీసుకుని పాతూరు వీధుల్లోకి పరుగులు తీశారు. చివరకు పోలీసులు జోక్యం చేసుకుని ఓటర్లు మినహా మిగిలిన వారందరినీ అక్కడి నుంచి బయటకు పంపారు.

ఓటుహక్కు వినియోగించుకున్న డీఆర్‌ఓ



కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి

అనంతపురం అర్బన్: జిల్లా రెవెన్యూ అధికారి జి.రామకృష్ణారెడ్డి తన కుటుంబసభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ సందర్భంగా సోమవారం నాల్గవ రోడ్డులోని ఇందిరా గాంధీ నగరపాలక ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన 55వ పోలింగ్ కేంద్రంలో కుటుంబ సమేతంగా వెళ్లి ఓటు వేశారు.



ఆత్మకూరు: ఓటుహక్కు వినియోగించుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



ఆత్మకూరు: సిరా గుర్తు చూపుతున్న తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, నయనతారెడ్డి



ప్రసన్నాయపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ వెన్నపూస రవీంద్రారెడ్డి

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా సోమవారం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తన సొంత గ్రామం అయిన తోపుదుర్తి గ్రామంలో ఉదయాన్నే అందరితో కలసి ఓటుహక్కు వినియోగించుకున్నారు. అదే విధంగా తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, తోపుదుర్తి నయనతారెడ్డి, తోపుదుర్తి చందు, తోపుదుర్తి శైలజారెడ్డి తోపుదుర్తి గ్రామంలోనే ఓటు వేశారు. పి.యాలేరు గ్రామంలో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఓటుహక్కు వినియోగించుకున్నారు. మండల వ్యాప్తంగా 39 పోలింగ్ కేంద్రాల్లో 33,227 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషుల ఓట్లు 16,519, మహిళల ఓట్లు 16,707 ఉన్నాయి. అదే విధంగా తోపుదుర్తి గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ పరిశీలించారు.

ఓటు వేసేందుకు పోటెత్తిన మహిళలు

ఉదయాన్నే కొద్ది పాటి వర్షం కురవడంతో గ్రామాల్లో ప్రజలు ఉదయం 7 గంటల నుంచే ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. గతంలో ఎన్నడూ జరగని విధంగా మహిళలు అధిక సంఖ్యలో ఓటు వేయడానికి రావడం విశేషం. పనులు సైతం వదిలి ఓటు వేయడానికి తరలివచ్చారు. మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, తోపుదుర్తి నయనతారెడ్డి, తోపుదుర్తి చందు పరిశీలించారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు.

7 గంటలకే పోలింగ్ కేంద్రాలకు..

రాప్తాడు: మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లోని గ్రామాల్లో సోమవారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వృద్ధులు, వికలాంగులు, చిన్న పిల్లల తల్లులు ఇబ్బందులు పడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన ఓటర్లు సీఎం జగన్ గెలిపించుకునేందుకు ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రాలకు ఉత్సాహంగా వెళ్లారు. రాప్తాడు, ప్రసన్నాయపల్లి, బొమ్మేపర్తి, పుల్లలరేవు, యర్రగుంట, బండమీదపల్లి, మరూరు, గొల్లపల్లి, హంపాపురం, గొందిరెడ్డిపల్లి, గాండ్లపర్తి, బుక్కచెర్ల తదితర గ్రామాల్లోని పలువురు వృద్ధులు, వికలాంగులు తమ కుటుంబ సభ్యులతో వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

రాప్తాడు: మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మండలంలోని పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని ప్రసన్నాయపల్లి గ్రామంలో మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ వెన్నపూస రవీంద్రారెడ్డి, బొమ్మేపర్తిలో ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, మరూరులో జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, బుక్కచెర్ల గ్రామంలో మాజీ ఐడీసీ చైర్మన్ నల్లప రెడ్డి, ఆయన సోదరుడు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ వీరా రెడ్డి, సర్పంచుల సంఘం మాజీ మండల అధ్యక్షుడు గంగలకుంట మధుసూదన్ రెడ్డి, ఎన్నికల విభాగం మండల ఇన్‌చార్జి సత్యనారాయణ రెడ్డి, రాప్తాడులో వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, రామినేపల్లిలో వైస్ ఎంపీపీ వరలక్ష్మీతో పాటు సర్పంచులు, ఎంపీటీసీలు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పోలింగ్ సందడి..

కనగానపల్లి/చెన్నేకొత్తపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకొనేందుకు ఓటర్లు పోటెత్తారు. చిన్న ఘర్షణలు, స్వల్ప సంఘటనలు మినహా రాప్తాడు నియోజకవర్గం వ్యాప్తంగా సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈ ఎన్నికల పోలింగ్‌లో నియోజకవర్గంలోని 281 పోలింగ్ స్టేషన్లలో సుమారు 2 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా సాయంత్రం 6 గంటలకు 75 శాతంపైగా ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. నియోజవర్గంలోని 22 పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ కొనసాగుతోంది. ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల్లో ఉదయం 10 గంటలకే 25 శాతం దాకా ఓట్లు పోలయ్యాయి. ఇక రాప్తాడు, చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి మండలాలలో ఉదయం కొంత పోలింగ్ శాతం తక్కువైనా, మధ్యాహ్నానికి పోలింగ్ శాతం పెరిగింది. సాయంత్రానికి చాలా కేంద్రాల్లో 75 శాతంపైగా పోలింగ్ నమోదైంది. ఇక చెన్నేకొత్తపల్లి మండలం వెంకటంపల్లి, ఓబుళంపల్లి, మేడాపురంలో గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్తున్న టీడీపీ నాయకుడు ఎల్ నారాయణప్పను స్థానికులు అడ్డుకొన్నారు. దీంతో కొంతసేపు ఆయా గ్రామాల్లో ఉద్రిక్తత నెలకొంది. కనగానపల్లి మండలంలోని నెమలివరం, యలకుంట్ల, బాలేపాళ్యం గ్రామాల్లో స్థానిక వైఎస్సార్‌సీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య తోపులాటలు జరిగాయి. సకాలంలో పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. చెన్నేకొత్తపల్లి మండలంలో అక్కడక్కడ వర్షం కురిసింది. అయినా ఓటర్లు వర్షంలో క్యూలైన్‌లో నిలుచుకుని ఓటు ఏశారు. మండలంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రామగిరి సీఐ శివాంజనేయులు, ఎస్ఐ వెంకటేశ్వర్లు వారి సిబ్బంది పర్యవేక్షించారు.



అనంతపురం కోర్టు రోడ్డులో ఓటు వేసేందుకు వచ్చిన ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, కుటుంబ సభ్యులు



కనగానపల్లిలో ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న మహిళా ఓటర్లు



రాప్తాడు: రామినేపల్లిలో ఓటు వేసి బయటకు వస్తున్న వృద్ధురాలు

కొడిమిలో బారులుతీరిన ఓటర్లు

అనంతపురం టౌన్: అనంతపురం రూరల్ మండలం కొడిమి గ్రామంలో ఓటర్లు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రానికి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం 5 గంటల సమయంలో సైతం వందల మంది ఓటర్లు పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరారు. గ్రామంలోని బూత్ నంబర్ 45లో ఈవీఎం మొరాయించడంతో ఓటర్లు గంటల తరబడి కేంద్రం వద్ద ఉండిపోయారు. సాయంత్రం 6 గంటల్లోపు పోలింగ్ సమయం ముగియడంతో అప్పటికే పోలింగ్ కేంద్రం వద్ద వేచి ఉన్న ఓటర్లకు టోకన్లు అందజేసి ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ అధికారులు అనుమతి ఇచ్చారు. దాదాపు 200 మందికి పైగా ఓటర్లకు అధికారులు టోకన్లు అందజేశారు. ఇక్కడ పోలింగ్ ముగిసేందుకు దాదాపు మరో 3 గంటలు సమయం పట్టే అవకాశం ఉంటుందని అక్కడి పోలింగ్ అధికారులు తెలిపారు.



పోలింగ్ కేంద్రం వద్ద సాయంత్రం 5 గంటల సమయంలో బారులు తీరిన ఓటర్లు

అనంతపురంలో సైడ్‌లైట్స్

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని పలు ప్రాంతాల్లో సాంకేతిక లోపం, ఇతరత్ర కారణాలతో ఓటర్లు అవస్థలు పడాల్సి వచ్చింది. సోమవారం జీసస్ నగర్‌లోని అరవిందఘోష్ స్కూల్‌లోని 163 బూత్‌లో ఈవీఎం మొరాయించింది. దీంతో ఓటర్లు గంటకుపైగా వేచి ఉండాల్సి వచ్చింది. అదేవిధంగా 4వ రోడ్డు నేతాజీ నగరపాలక ప్రాథమిక పాఠశాలలోని 62, 63 బూత్‌లలో ఈవీఎంలు పని చేయలేదు. అదే విధంగా కొన్ని పోలింగ్ కేంద్రాల్లో వీల్ చైర్లు ఏర్పాటు చేయకపోవడంతో వృద్ధులు, ప్రమాదాల్లో గాయపడిన వారు ఇబ్బందులు పడ్డారు. వాకర్ ద్వారానే వారు వెళ్లి ఓటుహక్కు వినియోగించుకోవాల్సి వచ్చింది.



విద్యారణ్య స్కూల్‌లో ఓటు వేయడానికి క్యూలో నిల్చున్న మేయర్ వసీం



చెన్నేకొత్తపల్లి: కనుముక్కలలో వృద్ధురాలిని వీల్‌చైర్‌లో తీసుకొస్తున్న దృశ్యం



ఓటు వేసిన వైఎస్సార్‌సీపీ అనంతపురం, హిందూపురం డిప్యూటీ రీజనల్ కో–ఆర్డినేటర్ రాగే పరుశురాం, కార్పొరేటర్ బండి నాగమణి



ఆత్మకూరు: తోపుదుర్తిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్



అనంతపురంలో మహిళ వేలికి సిరా చుక్క పెడుతున్న పోలింగ్ అధికారి

రాత్రి 11 వరకూ కొనసాగిన పోలింగ్..

రాప్తాడు: మండల పరిధిలోని 16 గ్రామ పంచాయతీల్లో సోమవారం సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో సాయంత్రం 6 గంటల దాకా దాదాపుగా 70 శాతం పైగా ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచే ఓటు వేయడానికి ప్రజలు బారులు తీరారు. మహిళలు, వృద్ధులు, వికలాంగులు, క్యూలో నిలుచుకుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాప్తాడులో ఉదయం కరెంట్ లేకపోవడంతో 7:30 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. మండలంలో అయ్యవారిపల్లిలో 142వ పోలింగ్ బూతు, బొమ్మేపర్తి గ్రామంలో 144వ పోలింగ్ బూతు, బుక్కచెర్లలో 145వ పోలింగ్ బూతు, ఎం.బండమీదపల్లి గ్రామంలో 151, 152వ పోలింగ్ బూతుల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఆయా గ్రామాల్లో రాత్రి 11 గంటల వరకూ ఓటింగ్ కొనసాగింది.



రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

పోలీస్ భారీ బందోబస్తు

ఎన్నికల నేపథ్యంలో మండలంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలను అనంతపురం రూరల్ డీఎస్పీ వీర వెంకట శివారెడ్డి పరిశీలించారు. స్థానిక పోలీసులతో పాటు ప్రత్యేక మొబైల్, టీమ్‌లను ఏర్పాటు చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పది నుంచి 30 మంది వరకు గట్టి బందో బసుత్ నిర్వహించారు. పోలింగ్ కేంద్రాలను సార్వత్రిక ఎన్నికల అబ్జర్వర్లు పరిశీలించారు.





ఓటు వేసిన అనంతరం సిరా గుర్తు చూపుతున్న అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్

ఓటు వేసిన ప్రజాప్రతినిధులు

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని ఆయా పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ప్రజాప్రతినిధులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. సోమవారం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలసి కోర్టు రోడ్డులో ఉన్న నెహ్రూ పాఠశాలలోని 125 బూత్‌లో ఓటు వేశారు. ఆ బూత్‌లో ఉదయాన్ని పోలింగ్ ప్రారంభ సమయంలో ఎమ్మెల్యే తొలి ఓటు వేసి ఓటు ప్రాముఖ్యతను తెలియజేశారు. ఎమ్మెల్యేతో పాటు వారి సోదరులు అనంత చంద్రారెడ్డి, అనంత సుబ్బారెడ్డి, కుటుంబ సభ్యులు అనంత మాలతి, అనంత సువర్ణ, అనంత నవ్యత, అనంత మేఘన, అనంత లిఖిత్ రెడ్డి, తదితరులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా జనశక్తి నగర్‌లోని 79వ పోలింగ్ బూత్‌లో ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకర నారాయణ, ఆయన సతీమణి జయలక్ష్మి ఓటు వేశారు. అలాగే కోవూర్‌నగర్ విద్యారణ్య స్కూల్‌లోని 101 బూత్‌లో మేయర్ వసీం ఓటు హక్కు వినియోగించుకున్నారు. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ నగరంలో ఓటు వేశారు.

పోలింగ్ కేంద్రాల్లో పర్యటించిన ఎమ్మెల్యే అనంత

నగరంలోని వివిధ పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు సరిగా పని చేస్తున్నాయా? ఏమైనా ఇబ్బందులన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ప్రజలకు నమస్కరించి అక్కడి నుంచి వచ్చేశారు. వృద్ధులు, వికలాంగులు, ప్రమాదాల్లో గాయపడుతూ పోలింగ్ కేంద్రాలకు వచ్చిన వారిని ఇబ్బంది లేకుండా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

రాప్తాడులో విజయం నాదే

- ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



రాప్తాడులో పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు నమస్కరిస్తున్న తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాప్తాడు: రాప్తాడులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం రాప్తాడులో జరుగుతున్న పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రాప్తాడు నియోజకవర్గంలో పోలింగ్ సరళి బాగానే జరుగుతోందన్నారు. ప్రతి చోట ఓటర్లు బారులు తీరారని తెలిపారు. చల్లని వాతావరణంలో ప్రజలు బయటకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. నియోజకవర్గంలో 80 నుంచి 90 శాతం ప్రజలు తమ వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి భారీ మెజార్టీ వచ్చే అవకాశాలున్నాయని వెల్లడించారు. మహిళలు చాలా చోట్ల పెద్ద సంఖ్యలో బయటకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. 60 శాతం మంది మహిళలు వైఎస్సార్‌సీపీకే మద్దతు ఇచ్చారన్నారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ రామాంజనేయులు, మండల కన్వీనర్ శేఖర్ తదితరులు ఉన్నారు.

సంక్షేమ పాలనకే పట్టం

కనగానపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ల జోరు చూస్తుంటే రాష్ట్రంలో సాగుతున్న సంక్షేమ పాలనకే ప్రజలు పట్టం కట్టినట్లు కనిపిస్తోందని ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. సోమవారం కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కొన్ని పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లి పోలింగ్ నమోదును పరిశీలించారు. టీడీపీ నాయకులు కుట్ర రాజకీయాలతో పాటు డబ్బులు ఎరచూపినా ఓటర్లు ప్రలోభాలకు లోనుకాకుండా వైఎస్సార్‌సీపీకే మద్దతు పలికారన్నారు. ఈ ఎన్నికల్లో రాప్తాడు నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీతో తాను గెలుపొందటంతో పాటు రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ స్థానాలను వైఎస్సార్‌సీపీనే కైవసం చేసుకొంటుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంకె లక్ష్మన్న, వలగొండ భాస్కర్, చిన్నారు రాము, అశోక్, గోపాల్, ఆలమూరప్ప, రమేష్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మహిళా కార్పొరేటర్‌పై దగ్గుపాటి దౌర్జన్యం

- అభ్యర్థి తీరుపై మండిపడ్డ వైఎస్సార్‌సీపీ శ్రేణులు



కార్పొరేటర్ నాగవినూతను దూషిస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

అనంతపురం కార్పొరేషన్: ఎన్నికల పోలింగ్‌లో టీడీపీ నాయకులు ఓవరాక్షన్ చేశారు. సోమవారం నగరంలోని కోర్టు రోడ్డు చైతన్య స్కూల్‌లోని 123వ పోలింగ్ కేంద్రంలో ఉన్న కార్పొరేటర్ నాగవినూతపై టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ నోరుపారేసుకున్నారు. మీరు ఇక్కడ కూర్చోకూడదని, మొదట బయటికి వెళ్లాలన్నారు. దీంతో కార్పొరేటర్ నాగవినూత కన్నీటి పర్యంతమయ్యారు. ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లు సైతం దగ్గుపాటి తీరును తప్పుబట్టారు. మహిళా అని చూడకుండా అక్కడి నుంచి వెళ్లాలని చెప్పడంతో నివ్వెర పోయారు. ఇంతలోనే విషయం కార్పొరేటర్ భర్త అమర్, వైఎస్సార్ నాయకులు ఘటన స్థలానికి వెళ్లారు. టీడీపీ అభ్యర్థి దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, తదితరులను నిలదీశారు. మహిళలతో ఏ విధంగా నడుచుకోవాలో తెలియదా అని ప్రశ్నించారు. దీంతో దగ్గుపాటి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అదే విధంగా 44వ డివిజన్ నేతాజీ స్కూల్‌లో బూత్ నంబర్ 62, 63లో టీడీపీకి చెందిన మాజీ కార్పొరేటర్ సరళ ఓవరాక్షన్ చేశారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ శాంతిసుధ ఉండకూడదని చెప్పారు. నిబంధనల ప్రకారం కార్పొరేటర్ ఏజెంట్ రిలీవర్‌గా ఉండవచ్చని కార్పొరేటర్ భర్త, క్లస్టర్ అధ్యక్షుడు మధు చెబుతున్నా.. సరళ రెచ్చిపోయింది. చివరకు రాయి తీసుకుని మధుపై దాడికి యత్నించింది. అక్కడే ఉన్న త్రీటౌన్ పోలీసులు చర్యలు తీసుకున్నారు. సరళను అక్కడి నుంచి పంపించేశారు. జీసస్‌నగర్‌లో పోలింగ్ బూత్‌కు దూరంగా కూర్చున్న బీఎల్‌ఓలు ఉండకూడదంటూ టీడీపీ నాయకుడు శ్రీకాంత్ హంగామా చేశాడు. కాసేపు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ నరసింహులతో శ్రీకాంత్ వాగ్వాదానికి దిగారు. చివరకు పోలీసులు జోక్యం చేసుకుని అక్కడి నుంచి పంపించేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

బత్తలపల్లి: అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై ఉప్పర్లపల్లి క్రాస్ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. ఉరవకొండకు చెందిన అనిల్, పాండు గ్రామంలో ఓటు హక్కును వినియోగించుకుని బైక్‌లో చిత్తూరుకు బయలుదేరారు. ఉప్పర్లపల్లి క్రాస్ వద్దకు రాగానే జాతీయ రహదారి పనులు చేస్తున్న విషయం గమనించకుండా కంకర కుప్పను ఎక్కించి కిందపడ్డారు. వీరిని బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు.